# 18181ని మించితే

# స్వల్ప కాలానికి పైకే




వరుసగా మూడో వారంలోనూ మార్కెట్ పతన ప్రస్థానాన్నే కొనసాగించింది. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) ఎడతెరిపి లేకుండా అమ్మకాలు జరపడం, దేశీయంగా, అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు వెలువడడం ఈ పరిస్థితికి దారి తీశాయి. వారాంతంలో మాత్రం సెన్సెక్స్ 265.57 పాయింట్ల లాభంతో స్థిరపడింది. గత వారంలో మార్కెట్ నష్టాల్లోనే ఉంది. అంతే కాక, ఎఫ్ఐఐల విక్రయాలు, లాభాల స్వీకరణ, 2జి-స్పెక్ట్రమ్‌పై సీబీఐ దర్యాప్తు, 6.2 మెగా హెర్ట్జ్‌కు మించిన స్పెక్ట్రమ్ పాన్-ఇండియా లైసెన్సులకు రుసుమును రూ.10,972 కోట్లకు పెంచుతూ ట్రాయ్ సిఫారసు చేయడం వంటి పరిణామాల నడుమ కొత్త నెలవారీ కనిష్ఠాలను నమోదు చేసింది కూడా. ఆహార ద్రవ్యోల్బణం రేటు 13.07 శాతానికి దిగివచ్చింది. అయినా సూచీల అధోగమనంలో మార్పు లేకపోయింది. శుక్రవారం వెలువడ్డ పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాలు ఆశించిన దాని కన్నా నిరుత్సాహకరంగా ఉండి, దీనికి తోడు ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సంకేతాలు అనుకూలంగా లేకపోవడంతో బీఎస్ఈ సెన్సెక్స్ 8 నెలల కనిష్ఠమైన 17296 స్థాయికి జారింది. అయితే ఆఖరు రోజు మధ్యాహ్న సమయంలో తక్కువ ధరల వద్ద మదుపరులు కొనుగోళ్లకు ముందుకు రావడం, ఈజిప్టులో రాజకీయ సంక్షోభం కొలిక్కి వచ్చే సూచనలు అందడంతో మార్కెట్ మూడు రోజుల క్షీణతకు అడ్డుకట్ట పడింది.

**ఎఫ్ఐఐల తీరు:** వరుసగా ఐదో వారమూ ఎఫ్ఐఐలు నికర అమ్మకందార్లుగా నిలిచారు. వారు రూ.1,437 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మరో వైపు మ్యూచువల్ ఫండ్‌లు సైతం నికర విక్రేతలుగా మారి, మొత్తం రూ.183 కోట్ల విలువైన షేర్లను అమ్మాయి.

**రంగాల వారీగా:** మన్నికైన వినియోగ వస్తువులు, లోహాల కంపెనీల షేర్లు ఇటీవలి ఎగువ స్థాయిల అనంతరం లాభాల స్వీకరణ కారణంగా అధిక నష్టాలను చవిచూశాయి. 2జి-స్పెక్ట్రమ్ నిధుల మూలాలను పసిగట్టడం కోసం సీబీఐ ప్రధాన రియల్టీ కంపెనీలపై దుర్భిణి వేసి చూస్తుండడంతో స్థిరాస్తి రంగం ఒత్తిడికి గురవక తప్పలేదు. తక్కువ ధరల వద్ద బ్యాంకుల షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్యాంకులతో పాటు వస్తు రంగం, వాహన రంగాలలో ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లు జరిగాయి.

**మార్కెట్ విస్తృతి:** షేర్ల లాభ నష్టాల నిష్పత్తి 3:1గా నమోదు అయింది. దీనిని బట్టి తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు జరిగినట్లు అర్థం అవుతుంది.

**ఈ వారం:** మార్కెట్ కీలకమైన 18181 స్థాయిని అధిగమించగలిగితే స్వల్ప కాల రికవరీ పథంలోకి అడుగిడుతుందని భావిస్తున్నారు. అంతకు లోపు రికవరీ ఏదైనా నిలదొక్కుకోజాలదు. దీనికి భిన్నంగా, సెన్సెక్స్ 17463 స్థాయికి దిగువన ముగిసినట్లయితే స్వల్ప కాలానికి మార్కెట్ అధోముఖ దశను కొనసాగిస్తుందనే గ్రహించాలి. ఎఫ్ఐఐల నిధుల ప్రవాహాలు మార్కెట్ గమనాన్ని శాసిస్తాయి. ఎఫ్ఐఐలు విక్రయాలను కొనసాగిస్తే మార్కెట్ మరింత జారుతుంది. కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటన ఇంకా ఆగనందున ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కొనసాగుతాయి.

**ప్రభావం చూపే అంశాలు:** సోమవారం వెలువడే టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ సమాచారాన్ని మార్కెట్‌లు నిశితంగా గమనిస్తాయి. ద్రవ్యోల్బణం పెరిగిందంటే రిజర్వు బ్యాంకు కీలక రేట్లను మళ్లీ సవరిస్తుందన్న భయాలు చెలరేగుతాయి. అలాగే, ఈ నెల 17న విడుదల అయ్యే వారంవారీ ఆహార ద్రవ్యోల్బణం వివరాలు కూడా ఒక ముఖ్యాంశమే. ఆహార ద్రవ్యోల్బణం దిగివస్తే మదుపరులలో విశ్వాసం మెరుగుపడవచ్చు. అమెరికా నుంచి అందే రిటైల్ విక్రయాలు, పారిశ్రామికోత్పత్తి, నిరుద్యోగుల భృతి సమాచారం వంటి సంకేతాలు కూడా మార్కెట్ చలనాలపై ప్రభావం చూపుతాయి.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18037, 18181, 18306; **తక్షణ మద్దతు స్థాయిలు:** 17508, 17276, 17000.

**సెన్సెక్స్ 18181 కి ఎగువన స్థిరపడితే స్వల్పకాలిక ఊర్ధ్వముఖ పయన దిశలోకి ప్రవేశించినట్లు అవుతుంది.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*